

## శ్రీయాన్ రామ్ కి అంతర్జాతీయ చెస్ రేటింగ్

గత నెలలో హర్యానా రాష్ట్రంలోని గురుగామ్ లో జరిగిన అండర్ 9 నేషనల్ చెస్ టోర్నమెంట్ లో వరంగల్ కు చెందిన తొమ్మిది సంవత్సరాల శివరాత్రి శ్రీయన్ రామ్ పాల్గొని అద్భుతమైన ప్రదర్శన కనబరిచారు. క్లాసికల్ చెస్ ఫార్మాట్ నందు 1,506 ఫిడే రేటింగ్ సాధించారు. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న శ్రీయన్ రామ్ ఈ ఘనత సాధించడంతో తల్లి దండ్రులు లలిత–శ్రావణ్ కుమార్ తోపాటు శ్రేయోభిలాషులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – వరంగల్ వాయిస్, వరంగల్


# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 248
పేజీలు : 08 | వెల: రూ.5/-
గురువారం
జూలై 03, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




8లో..

## జర్నలిస్ట్ జ్ఞాపకార్థం కమ్యూనిటీ హాల్

- రూ.20 లక్షల ఎంపీ నిధులతో ఏర్పాటు
- శంకుస్థాపన చేసిన డాక్టర్ కడియం కావ్య



8లో..

## పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలి

- మేడారం జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి
- వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలి
- దేవాదాయ శాఖ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్



8లో..

## ఉగ్ర ప్రభాగ భద్రకాళి

ఎనిమిదో రోజుకు చేరిన శాకంబరి



# నిషేధమా.. అదెక్కడ?

వివరాలు2లో..



- విచ్చలవిడిగా ప్లాస్టిక్ విక్రయాలు
- నిషేధించి రెండు సంవత్సరాలు
- తూతూ మంత్రంగా తనిఖీలు
- జరిమానా వేసి చేతులు దులుపుకుంటున్న అధికారులు
- 'నో ప్లాస్టిక్ బ్యాగ్స్ డే' సందర్భంగా వరంగల్ వాయిస్ కథనం




పర్యావరణానికి విఘాతం కలిగిస్తూ ప్రాణకోటికి సంకటంగా మారిన ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధిస్తూ 2022లో చట్టం చేసింది. నిషేధిత ప్లాస్టిక్ జాబితాలో 75 మైక్రాన్ల లోపు మందం కలిగిన క్యారీ బ్యాగులతో పాటు 50 మైక్రాన్ల లోపు మందం ఉన్న ప్లాస్టిక్ షీట్లు, సీసాలు, గ్లాసులు, కప్పులు, స్పూన్లు, స్ట్రాలు, పాన్ మసాలా ప్యాకెట్లతోపాటు మరో 18 రకాల ప్లాస్టిక్ ఉత్పత్తులను చేర్చారు. అయితే ప్రభుత్వం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను నిషేధించి రెండు సంవత్సరాలు కావస్తున్నా వరంగల్ మహా నగరపాలక సంస్థ పరిధిలో దీని ప్రభావం మచ్చుకైనా కానరావడంలేదు. విచ్చలవిడిగా విక్రయాలు సాగిస్తున్నా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సమయంలో కొంత హంగామా చేసిన బల్దియా అధికారులు ఆ తర్వాత ఏమైందో ఏమోగాని మన్నుతిన్న పాముల్లా తయారయ్యారు. బహిరంగంగానే విక్రయాలు సాగిస్తున్నా నెలవారీ మామూళ్లకు అలవాటు పడిన అధికారులు వాటిని ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఉనికిని చాటుకునేందుకు తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తూ నామ మాత్రపు జరిమానాలు విధించండంతో దుకాణ దారులు రెచ్చిపోయి విక్రయాలు సాగిస్తున్నారు. 'నో ప్లాస్టిక్ బ్యాగ్స్ డే' సందర్భంగా వరంగల్ వాయిస్ ప్రత్యేక కథనం మీకోసం.. - వరంగల్ వాయిస్ ప్రతినిధి

# నిషేధమా.. అదెక్కడ?




- విచ్చలవిడిగా ప్లాస్టిక్ విక్రయాలు
- నిషేధించి రెండు సంవత్సరాలు
- తూతూ మంత్రంగా తనిఖీలు
- జరిమానా వేసి చేతులు దులుపుకుంటున్న అధికారులు
- 'నో ప్లాస్టిక్ బ్యాగ్స్ డే' సందర్భంగా వరంగల్ వాయిస్ కథనం

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న అత్యంత ప్రమాదకరమైన పరిణామాలలో ప్లాస్టిక్ కాలుష్యం ఒకటి. దీని వాడకం రోజురోజుకూ పెరుగుతోంది. జిల్లా కేంద్రాలే కాదు పట్టణాలు, గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఇక గ్రేటర్ వరంగల్ లో మాత్రం ప్లాస్టిక్ వినియోగంపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. నెలవారీ మామూళ్లకు అలవాటు పడిన అధికారులు ప్రభుత్వ నిబంధనలను పక్కన పెట్టి దుకాణదారులు ఇచ్చే కవర్లకోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. దీంతో ప్లాస్టిక్ విక్రయదారుల వ్యాపారం మూడు కవర్లు..ఆరు గ్లాసులు అన్న చందంగా సాగుతోంది. ప్లాస్టిక్ తో ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణానికి ఎదురవుతున్న సమస్యలకు అడ్డుకట్ట వేయాలన్న సంకల్పంతో ప్రతి ఏడు జూన్ 3న నో ప్లాస్టిక్ బ్యాగ్స్ డే గా నిర్వహించాలని ప్రపంచ దేశాలు నిర్ణయించాయి.

**పర్యావరణంపై తీవ్ర ప్రభావం..**

పర్యావరణంపై ప్లాస్టిక్ వ్యర్థాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కూరగాయలు, పండ్లు, టిఫిన్ సెంటర్లు, చికెన్ షాపులు, ఆఖరికి దేవుడికి భక్తితో సమర్పించే కొబ్బరి కాయకు కూడా ప్లాస్టిక్ కవర్లనే వాడుతున్నారు. విందు, వినోదాల్లో కూడా ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులనే వినియోగిస్తున్నారు. చివరకు మనం నేరుగా సేవించే జ్యూస్ లు, ఆహార పదార్థాలకు కూడా ప్లాస్టిక్ కవర్లనే వినియోగిస్తున్నాము. టీ, కాఫీలకు కూడా ఈ ప్లాస్టిక్ కవర్లనే ఉపయోగిస్తున్నాము. కొత్తగా ఆహార పదార్థాలకు సిల్వర్ కవర్లను వాడుతున్నారు. అవి మరీ డేంజర్ అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ విస్మరిస్తున్నారు. వేడి ఆహార పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో ప్యాకింగ్ చేయడంతో ప్లాస్టిక్ నానో ఆర్టికల్స్ కరిగి ఆహారంలో కలిసిపోయి ప్రాణ సంకటంగా మారుతోంది.

**ఏ కాలువ చూసినా..**

బల్దియా పరిధిలోని మురుగు కాలువలన్నీ ప్లాస్టిక్ మయమవుతున్నాయి. ఏ కాలువ చూసినా ఏ ముంది గర్వకారణం అన్నట్లుగా గ్రేటర్ పరిధిలోని మురుగు కాలువలు మారాయి. ప్రతి కాలువలో ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, బాటిల్స్ తో నిండుకుంటుంది. దీంతో మురుగు కాలువలు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండుకొని నీరు ప్రవహించకుండా అడ్డుకుంటున్నాయి. కాలువలు, చెరువుల్లోకి చేరుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలతో ఆయా కాలువలు, చెరువులు కలుషితం అవుతున్నాయి.



నీరు భూమిలోకి ఇంకకుండా కవర్లు అడ్డుకట్టగా నిలుస్తున్నాయి. దీంతో నగరంలో భూగర్భ జలాల నీటి మట్టాలు రోజు రోజుకూ పడిపోతున్నాయి.

**అమలు చేసే వారేరీ..?**

ప్లాస్టిక్ భూతాన్ని అరికట్టేందుకు కఠినమైన చట్టాలు ఉన్నప్పటికీ వాటిని అమలు చేసే వారే కరువు కావడంతో పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోతోంది. ప్లాస్టిక్ ను అరికట్టాల్సిన మహా నగర పాలక సంస్థ అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. గతంలో బల్దియాలో ప్లాస్టిక్ పై యుద్ధమే చేశారని చెప్పవచ్చు. అప్పటి ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ బల్దియా సర్వ సభ్య సమావేశాలకు హాజరైన ప్రతి సారి తన వెంట నీరు తాగేందుకు స్టీల్ గ్లాసుకు కూడా తీసుకొని వచ్చేవారు. ఆయన స్ఫూర్తితో గ్రేటర్ అధికారులు కూడా ప్లాస్టిక్ విక్రయ దారులపై మెరుపు దాడులు జరిపి పెద్ద మొత్తంలో జరిమానాలు విధించడంతో కొంత వరకు అదుపులోకి వచ్చింది. తర్వాత పట్టించుకునే వారు లేకపోవడంతో నగరంలో ప్లాస్టిక్ భూతం జడలు విప్పుతోంది. ఇప్పటికైనా ఒక వైపు చట్టాలను కఠినంగా అమలు చేస్తూ మరో వైపు ప్రజలను చైతన్యం చేయడంద్వారా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించే అవకాశం ఉంటుందన్న అభిప్రాయం వ్యక్త మవుతోంది. అదే విధంగా ప్లాస్టిక్ బ్యాగుల తయారీ కేంద్రాలపై కూడా కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

## అవగాహన కల్పించాలి

**- పర్యావరణ వేత్త నిమ్మల శ్రీనివాస్**




ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ ఉత్పత్తులతో పర్యావరణానికి హాని కలగటమేకాక అనేక అనర్థాలకు దారి తీస్తుందని సామాజిక వేత్త, పర్యావరణ ప్రేమికులు నిమ్మల శ్రీనివాస్ అన్నారు. జూన్ మూడో తేదీ 'నో ప్లాస్టిక్ బ్యాగ్స్ డే' ను పురస్కరించుకొని ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ ఉత్పత్తులను సాధ్యమైనంత వరకు తగ్గించి గుడ్డతో తయారుచేసిన చేతి సంచులను వాడాలన్నారు. దీనిపై తాను గతంలో నిర్వహించిన అనేక కార్యక్రమాలను గుర్తు చేశారు. ప్లాస్టిక్ ఉత్పత్తులు భూమిలో కలవటానికి కొన్ని వందల సంవత్సరాలు పడుతుందన్నారు. ప్లాస్టిక్ ఎన్నో అనర్థాలకు దారితీస్తుందన్నారు. రానున్న మన భవిష్యత్ తరాల మనుగడ ప్రమాదకరంగా మారుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, మేధావులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## 'ప్లాస్టిక్ కవర్లు వద్దు.. గుడ్డ సంచులే ముద్దు' : డాక్టర్ భూజేందర్ రెడ్డి




అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగుల నివారణ దినోత్సవం సందర్భంగా వరంగల్ లోని ఏవీవీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కోడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం 'ప్లాస్టిక్ బ్యాగులు వద్దు.. గుడ్డ సంచులు, టిఫిన్ బాక్సులే ముద్దు' అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భూజేందర్ రెడ్డి, పోగ్రామ్ అధికారి కోడిమాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం 90 మైక్రాల కన్నా తక్కువ మందం కలిగిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాగ్స్ ను ఎప్పుడో బ్యాన్ చేసినప్పటికీ ఇంకా చలామణిలో ఉన్నాయన్నారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్లతో కాలువలు, చెరువులు, నదులు కలుషితమవుతున్నాయని అలాగే భూమి, ఇతర జంతువులకు కూడా నష్టం వాటిల్లుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ విధిగా బట్ట సంచులు వాడాలన్నారు. అప్పుడే మీరు పర్యావరణ పరిరక్షణకు మేలు చేసిన వారు అవుతారన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం నడుం భిగించాలన్నారు. ముఖ్యంగా వాలంటీర్లను చుట్టుపక్కల వారికి అవగాహన కల్పించాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎస్.అనిత, సంజీవ, నవీన్, సంధ్యా రాణి, రమాదేవి, శ్రీకాంత్, సీనియర్ వాలంటీర్లు దేవిశ్రీప్రసాద్, సాకేత్, క్రాంతి, సాత్విక్, చిరంజీవి, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యతగా విధులు నిర్వహించాలి



- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- బూత్ లెవెల్ అధికారులకు జాతీయ శిక్షణ అవగాహన కార్యక్రమం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** బూత్ లెవెల్ అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలని బల్దియా కమిషనర్, 106- వరంగల్ (తూర్పు) నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి చాహత్ బాజ్ పాయ్ అన్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని బూత్ స్థాయి ఆఫీసర్లకు వరంగల్ ఐఎంఏ హాల్ లో గురువారం ఏర్పాటు చేసిన జాతీయ శిక్షణ అవగాహన కార్యక్రమంలో ఆర్ఓ పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఎంతో ప్రతిష్టాత్మకంగా బూత్ లెవెల్ అధికారులకు ప్రతి రోజు 50 మంది చొప్పున ఓరియంటేషన్ ప్రోగ్రామ్ లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఓటర్ లిస్ట్ లో ఎలాంటి తప్పులు లేకుండా తయారు చేయడానికి బూత్ లెవెల్ అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకుల పేరు నమోదు చేయడంతో పాటు మృతి చెందిన వారి వివరాలను తొలగించాలన్నారు. తప్పులు లేని ఓటరు జాబితా తయారే లక్ష్యంగా బూత్ లెవెల్ అధికారులు కృషి చేయాలన్నారు. ఓటు నమోదు, తొలగింపు అనునది బీఎల్ఓలు విచారణ తర్వాతే చేపట్టాలని తద్వారా ఎలాంటి తప్పు జరగడానికి ఆస్కారం ఉండదని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ తహసీల్దార్ మహమ్మద్ ఇక్బాల్, ఎన్నికల డీటీ సుబాన్, మాస్టర్ ట్రేని సందీప్ తో పాటు శిక్షకులు కనకయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సమయపాలన ప్రగతికి సంకేతం

◆ సమష్టి కార్యక్రమాలు ప్రోత్సాహకరం
◆ లయన్ టి.రాజేంద్ర ప్రసాద్

**వరంగల్ వాయిస్, జనగామ :** సమాజంలో వ్యవస్థలకైనా, వ్యక్తులకైనా సమయపాలన పాటించడం ప్రగతికి సంకేతం అని లయన్స్ 320 మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ లయన్ టి. రాజేంద్రప్రసాద్ అన్నారు. జూలై 2, బుధవారం రాత్రి జనగామ ఆబాద్ లయన్స్ భవన్‌లో జరిగిన ఆబాద్, బి–బాయ్స్, కింగ్స్, గ్రేటర్ లయన్స్ క్లబ్‌ల సంయుక్త పదవీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. లయన్స్ క్లబ్ జనగామ ఆబాద్ ప్రస్తుత అధ్యక్షుడు డాక్టర్ పి. నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జనగామ ప్రాంతంలో లయన్స్ క్లబ్‌లు అందిస్తున్న సేవలు అభినందనీయమని ప్రశంసించారు. మల్టిపుల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన రెండవ రోజే జనగామకు రావడం, సమిష్టి కార్యక్రమంలో పాల్గొనడం సంతోషదాయకమని తెలిపారు. ఇలాంటి సమిష్టి కార్యక్రమాల వల్ల సమయం, ఆర్థిక వనరుల పొదుపు జరుగుతుందని, అంతేకాకుండా కలిసి పనిచేయడం వల్ల ఆ పని తప్పనిసరిగా విజయవంతం అవుతుందని ఆయన అన్నారు. నూతన నాయకులుగా ప్రమాణస్వీకారం చేసిన టీం నాయకులను ఆయన అభినందించారు. తొలుత ప్రోగ్రాం కమిటీ చైర్మన్ కే. రాజశేఖర్ రెడ్డి ఆహుతులందరికీ స్వాగతం పలికారు. ఫస్ట్ వైస్ జిల్లా గవర్నర్ లయన్ సుధాకర్ రెడ్డి క్లబ్ సారథుల విధులు, బాధ్యతల గురించి వివరించి వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. లయన్స్ క్లబ్ జనగామ ఆబాద్ అధ్యక్షుడు కే సత్యనారాయణ, కార్యదర్శి పి సురేష్, కోశాధికారి ఎస్. ప్రవీణ్; బి బాయ్స్ క్లబ్ అధ్యక్షుడు కన్న శ్రీనివాస్, కార్యదర్శి బూరెడ్డి ప్రమోద్ రెడ్డి, కోశాధికారి మంగ వెంకటేశ్వర్లు; కింగ్స్ క్లబ్ అధ్యక్షుడు డా. రంజిత్ కుమార్, కార్యదర్శి డా. కనకరాజు, కోశాధికారి డా. ఏ. స్వప్న మూర్తి; గ్రేటర్ క్లబ్ అధ్యక్షుడు గూడ రాజాబోస్, కార్యదర్శి




గునిగంటి రామకృష్ణ, కోశాధికారి బూడిద శ్రీనివాస్ లతో పాటు వారి వారి కార్యవర్గ సభ్యులు పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథి, ఇన్‌స్టలేషన్ అధికారిని పూర్వ జిల్లా గవర్నర్‌లు డా. డి. లవకుమార్ రెడ్డి, కన్న పరశురాములు సభకు పరిచయం చేశారు. నూతన కార్యవర్గాల నాయకులకు అభినందనలు తెలుపుతూ గ్లోబల్ యాక్షన్ టీం జిల్లా లీడర్స్ డా. వి. శారదా దేవి, రేవూరి రమణా రెడ్డి, కుర్రేముల యాదగిరి, క్రిష్ణ జీవన్ బజాజ్, కానుగంటి సుభాష్, జి. ప్రమోద్ కుమార్ గుప్త; జిల్లా సెక్రటేరియట్ నాయకులు డా. జి. సురేశ్ కుమార్, చంద్రగిరి ప్రసాద్, మార్గం ప్రభాకర్; రీజియన్ చైర్మన్‌లు రామిని శ్రీనివాసులు, చంద్రగిరి శ్రీనివాస్; జోన్ చైర్మన్‌లు ఫజ్జూరి లక్ష్మీ నర్సయ్య, బుక్క బాలభర్ద్వజ్, కుతాటి ఉప్పలయ్య, బైరు వెంకటేశ్వర్లు ప్రసంగించారు. కార్యక్రమ వ్యాఖ్యాతగా లయన్ శ్రీభాష్యం రఘు వ్యవహరించగా, ప్రారంభంలో అల్లాడి ప్రభాకర్ పతాక వందనం చదివారు. చివరన నాగబండి రవీందర్ వందన సమర్పణ చేసిన ఈ వేడుకలో పూర్వ రీజియన్ చైర్మన్‌లు చందుపట్ల రవీందర్ రెడ్డి, సి. ఉపేందర్ రెడ్డి, డా. సి. హెచ్. రాజమౌళి, పెద్ది వెంకట నారాయణ గౌడ్, ఏ. భిక్షపతి, శ్రీరాం శ్రీనివాస్, ఏ. నర్సిరెడ్డి, దోర్నాల వెంకటేశ్వర్లు ఇంకా పూర్వ అధ్యక్షులు ఇ. ప్రభాకర్ రెడ్డి, ఏ. మహేశ్వర్ రావు, డా. జి. సీతారాం, పి. యాదగిరి రెడ్డి, టి. వెంకట మల్లారెడ్డి, లగిశెట్టి శంకర లింగం, కిషోర్, డా. శివశంకర్ రావు, బచ్చు రమేష్, రామిని సత్యనారాయణ పాల్గొన్నారు.

# 6న భట్టి విక్రమార్క మహబూబాబాద్ పర్యటన



● ఎమ్మెల్యే మురళీ నాయక్

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జూలై 6న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మహబూబాబాద్ నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలతో చేపట్టే వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాలు, భారీ బహిరంగ సభ పర్యటనను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ఉప ముఖ్యమంత్రి పర్యటన సన్నాహక సమావేశంలో, ఎమ్మెల్యే మురళీ నాయక్ సభ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో రహదారులు, విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణ పనులకు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్కలతో కలిసి ఉప ముఖ్యమంత్రి శంకుస్థాపన కార్యక్రమాలు చేయనున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలైన ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500కి గ్యాస్, సన్నబియ్యం పంపిణీ, సన్న వడ్లకు బోనస్, ఇందిరమ్మ ఇళ్ల పథకాలు కొనసాగిస్తున్నామని, వీటిని గ్రామగ్రామాన ప్రజలకు వివరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు భరత్ చందర్ రెడ్డి, ఇతర కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

# 59వ డివిజన్‌కు కొత్త ట్రాక్టర్ మంజూరు

◆ కార్పొరేటర్ వసంత మహేందర్ రెడ్డి

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** హనుమకొండలోని 59వ డివిజన్‌కు కొత్త ట్రాక్టర్ మంజూరైంది. పారిశుధ్య పనుల కోసం ఉపయోగిస్తున్న పాత ట్రాక్టర్ తరచుగా మరమ్మతులకు గురై పనికిరాకుండా పోవడంతో, స్థానిక కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్ రెడ్డి ఈ సమస్యను పరిష్కరించడానికి పలుమార్లు కమిషనర్, సీఎంహెచ్ఓ, మేయర్‌కు వినతి పత్రాలు సమర్పించారు. దీని ఫలితంగా వరంగల్ కార్పొరేషన్‌కు మంజూరైన కొత్త ట్రాక్టర్‌లలో ఒకటి 59వ డివిజన్‌కు కేటాయించబడింది. ఈ సందర్భంగా నూతన ట్రాక్టర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో డివిజన్‌లోని వివిధ కాలనీ అధ్యక్షులు, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ట్రాక్టర్ డ్రైవర్ భూక్య చందర్రావు, క్లీనర్ ఐలయ్యలను కార్పొరేటర్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ కాలనీ ప్రెసిడెంట్ అశోక్ రెడ్డి, స్నేహ నగర్ కాలనీ ప్రెసిడెంట్ నరసింహారావు, కనకదుర్గ కాలనీ ప్రధాన కార్యదర్శి నారాయణ రెడ్డి, భవాని నగర్ ఆలయ కమిటీ ప్రెసిడెంట్ గుడి లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి దేశిని రాజమౌళి, రిటైర్డ్ ప్రొఫెసర్ రామ్ రెడ్డి, చాడ శ్రీనివాస్ రెడ్డి, సత్యపాల్ రెడ్డి, కర్ణాకర్ రెడ్డి, చాడ నరసింహారెడ్డి, మురళీధర్ రావు, వాయిల జితేందర్, ఎల్లయ్య, వికాస్ నగర్ నుంచి చదువు రమణారెడ్డి, బాసెట్టి మల్లయ్య, అల్లం మల్లికార్జున్, కంది ఉమా రెడ్డి, లోకు శ్రీకాంత్,



రత్నాకర్ రెడ్డి, వివిధ కాలనీవాసులు, డివిజన్ జవాన్లు సతీష్, మహేష్, విక్కీ మరియు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన..

59వ డివిజన్‌లోని స్నేహ నగర్ కాలనీలో గల రోడ్డు నంబర్ 2, 3లో రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ గుజ్జులా వసంత మహేందర్ రెడ్డి ఈరోజు పరిశీలించారు. అలాగే, రోడ్డు నంబర్ 19 నందు డ్రైన్ మరియు రోడ్డు నిర్మాణం కొరకై అంచనాలు (ఎస్టిమేషన్స్) వేయించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు చిన్న, ఆలయ కమిటీ అధ్యక్షులు బాలరాజు, కాలనీవాసులు ధర్మ, బాపురెడ్డి, రాంబ్రహ్మం, డివిజన్ డీఈ సారంగపాణి, ఏఈ మేనక, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ మరియు స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఏఐటీయూసీ సమ్మె నోటీసు



**వరంగల్ వాయిస్, మంచిర్యాల :** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులను కాలరాసి, వ్యాపార వర్గాలకు మాత్రమే లాభం చేకూర్చే విధంగా ఉన్నాయని ఆరోపిస్తూ ఏఐటీయూసీ సమ్మె నోటీసు ఇచ్చింది. జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ కేంద్రం తీసుకొచ్చిన వేతనాల కోడ్, పారిశ్రామిక సంబంధాల కోడ్, సామాజిక భద్రతా కోడ్, వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్.. ఈ నాలుగు చట్టాలు కార్మిక వర్గాన్ని, ఉద్యోగులను వారి హక్కులను కోల్పోయేలా చేస్తాయని విమర్శించారు. ఇవి బడా పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన "నల్ల చట్టాలు" అని, వీటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతూ విధుల్లో పాల్గొంటారని ఏఐటీయూసీ ప్రకటించింది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, నేషనల్ హెల్త్ మిషన్ సంఘం మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి దేవనబోయిన బాపు, కళావతి, శ్రీవాణి, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

# ఖర్గే సభను విజయవంతం చేయాలి

వెంకటాపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేష్



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్:** ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ముఖ్య అతిథిగా హాజరయ్యే సభను విజయవంతం చేయాలని వెంకటాపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కట్టెకోళ్ల వెంకటేష్ యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం వెంకటాపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 4న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరగనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. గ్రామస్థాయి నాయకులతో ఖర్గే నేరుగా మాట్లాడే ఉద్దేశ్యంతో ఈ సభను ఏర్పాటు చేశారని వెంకటేష్ యాదవ్ తెలిపారు. కాబట్టి, మండలంలోని గ్రామ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మార్తినేని ధర్మారావుకు సన్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైన హనుమకొండ పశ్చిమ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, తెలంగాణ రాష్ట్ర బీజేపీ క్రమశిక్షణ సంఘం కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావును వారి స్వగృహంలో పలువురు బీజేపీ నాయకులు కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. మార్తినేని ధర్మారావు భారతీయ జనతా పార్టీలో గత 45 సంవత్సరాలుగా ఎలాంటి పదవులు ఆశించకుండా కష్టకాలం నుంచి పార్టీ కోసం కృషి చేస్తున్నారని నేతలు కొనియాడారు. రాష్ట్ర పార్టీ అప్పగించిన ప్రతి పదవికి న్యాయం చేస్తూ, ఒకసారి హనుమకొండ శాసనసభ్యులుగా ఎన్నికయ్యారని గుర్తు చేశారు. రాష్ట్ర బీజేపీలో అనేక పదవులు పొంది, ఇప్పుడు బీజేపీ జాతీయ కౌన్సిల్ మెంబర్‌గా ఎన్నికయ్యారని పేర్కొన్నారు. వారు మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు బింగి శ్రీనివాస్, బీజేపీ సీనియర్ నాయకులు, హనుమకొండ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొత్త రవి, బీజేపీ సీనియర్ నాయకులు మారేపెల్లి విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

## 4న ఖర్గే సభను జయప్రదం చేయండి

**టీపీసీసీ ఉపాధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి**



**వరంగల్ వాయిస్, భువనగిరి:** జూలై 4న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరగనున్న ఏఐసీసీ అధ్యక్షులు శ్రీ మల్లికార్జున ఖర్గే గారి బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ భువనగిరి జిల్లా కేంద్రంలో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అండెం సంజీవ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, భువనగిరి పార్లమెంట్ ఇంచార్జులు కోటంరెడ్డి వినయ్ రెడ్డి, బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నూతి సత్యనారాయణ గౌడ్, ఈ.వీ. శ్రీనివాస్ రావు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు చెల్లించాలి

**సర్పంచుల ఫోరం ఎంపీడీవోకి వినతి**



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** గ్రామాలలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుతూ సర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో గురువారం ఆత్మకూరు ఎంపీడీవోకి వినతి పత్రాన్ని సమర్పించారు. మండల మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షులు కమల రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ, 2019 నుంచి 2024 వరకు పదవీకాలంలో సర్పంచులు గ్రామాలలో చేసిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను తక్షణమే ఇప్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించేంతవరకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించవద్దని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల మాజీ సర్పంచులు రంపిస మనోహర్, కటాక్షపూర్ మాజీ సర్పంచ్ యాదగిరి, కొత్తగట్టు మాజీ సర్పంచ్ బొల్లం నరేష్, లింగమడుగుపల్లె మాజీ సర్పంచ్ రాజేశ్వరి రాజు పాల్గొన్నారు.

## 40వ డివిజన్‌కు కొత్త చెత్త ట్రాక్టర్



**వరంగల్ వాయిస్, కరీమాబాద్:** 40వ డివిజన్‌లోని మురుగు కాలువల నుండి తీసిన చెత్తాచెదారాన్ని తరలించడానికి మహానగర పాలక సంస్థ నూతనంగా చెత్త ట్రాక్టర్‌ను పంపించినందున, డివిజన్‌లో కొంతమేరకు పారిశుద్ధ్య సమస్యలు తొలగిపోతాయని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. గురువారం కరీమాబాద్ వాటర్ ట్యాంక్ మైసమ్మ గుడి వద్ద కార్పొరేటర్ మరుపల్ల రవి ట్రాక్టర్‌కు పూజలు నిర్వహించి ప్రారంభించారు. డివిజన్‌లో పాత ట్రాక్టర్లు తరచుగా పాడైపోవడం వల్ల చెత్తాచెదారం పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యపై అనేకమార్లు అధికారులకు విన్నవించినందున కొత్త ట్రాక్టర్ వచ్చిందని ఆయన తెలిపారు. తమ వినతిని ఆలకించి ట్రాక్టర్‌ను పంపిన మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చహత్ బాజుపాయ్, సీఎంహెచ్ఓ రాజిరెడ్డి, ఎమ్ హెచ్ఓ రాజేష్‌లకు కార్పొరేటర్ మరుపల్ల రవి కృతజ్ఞతలు తెలిపారు. పూజా కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఇస్త్రం శ్రీను, జవాన్లు రమేష్, ఆదామ్, కృష్ణ, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

# ఖర్గే సభకు హనుమకొండ కాంగ్రెస్ కార్యాచరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** జూలై 4న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరగనున్న "సంవిధాన్ పరిరక్షణ శంఖారావం" సభను విజయవంతం చేసేందుకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ భవన్‌లో డీసీసీ అధ్యక్షులు, పశ్చిమ వరంగల్ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సభలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ కార్యకర్తలతో సమావేశం కానున్నారు. ఈ వినూత్న కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, కార్యకర్తలకు నూతన స్ఫూర్తిని అందించడానికి దోహదపడుతుందని నేతలు అభిప్రాయపడ్డారు. సభ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించిన డీసీసీ నాయకత్వం, బస్సులు, వాహనాల ఏర్పాట్లతో పాటు కార్యకర్తల భద్రత, నిబంధనలు, సమయపాలన తదితర అంశాలపై చర్చించి తగిన విధంగా కార్యాచరణను రూపొందించింది. కాంగ్రెస్ శ్రేణులు ఈ సభను ఒక చారిత్రక విజయంగా మార్చే దిశగా కృషి చేయాలని డీసీసీ నాయకత్వం పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇంచార్జిలుగా నియమితులైన టీపీసీసీ ఉపాధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు దుద్దిళ్ల శ్రీను బాబు, పల్లె శ్రీనివాస్ గౌడ్, మోత్కూరి ధర్మారావు లతో కలిసి "చలో హైదరాబాద్" పోస్టర్‌ను ఆవిష్కరించారు.

## నేతన్నల రుణాలన్నీ మాఫీ చేయాలి

**తాటిపాముల వెంకట్రాములు డిమాండ్**



**వరంగల్ వాయిస్, వరంగల్:** రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల రుణాలన్నింటినీ మాఫీ చేయాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కార్మిక సంఘాల పోరాటాలతో పాటు, తమ ప్రతినిధులు ముఖ్యమంత్రికి, చేనేత శాఖా మంత్రికి సమస్యలపై అనేకసార్లు వినతి పత్రాలు సమర్పించారని, ఫలితంగా కొన్ని చర్యలు చేపట్టారని వెంకట్రాములు తెలిపారు. అయితే, ఇటీవల ప్రభుత్వం నేతన్నలకు లక్ష రూపాయల వరకు రుణమాఫీపై జీవో విడుదల చేసిందని, దానిని సవరించి రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతన్నలకు రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేసిన ప్రభుత్వం, నేతన్నలపై వివక్ష చూపడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చేనేత కార్మికులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా పూర్తిగా రుణమాఫీ చేయాలని ఆయన కోరారు. సహకార సంఘాలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నందున కార్మికులకు పనులు కల్పించలేకపోతున్నాయని, ఫలితంగా కార్మికులు ఉపాధి లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని వెంకట్రాములు ఆవేదన వ్యక్తం చేశారు. సహకార సంఘాల రుణాలన్నింటినీ మాఫీ చేసి, తిరిగి వడ్డీ లేని రుణాలు అందించాలని సూచించారు. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు జరపకపోవడం వల్ల సహకార వ్యవస్థ చిన్నాభిన్నమైపోయిందని, తక్షణమే చేనేత సహకార సంఘాలకు, టెస్కోకు ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. తీవ్రమైన సంక్షోభంలో ఉన్న చేనేత పరిశ్రమ పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అన్నారు. 50 సంవత్సరాలు దాటిన చేనేత కార్మికులకు నెలకు రూ.5,000 పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా, కేంద్ర ప్రభుత్వం తక్షణమే చేనేతపై జీఎస్టీ రద్దు చేయాలని కూడా వెంకట్రాములు డిమాండ్ చేశారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్ఠాపనకు అనుమతివ్వాలి

**తహసీల్దార్‌కు పద్మశాలీ నేతల వినతి**




**వరంగల్ వాయిస్, శాయంపేట:** ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్టాపనకు అనుమతి ఇవ్వాలని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం గురువారం శాయంపేట మండల తహసీల్దార్, ఎంపీడీవోలను కోరింది. ఈ మేరకు వారికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు వంగర సాంబయ్య మాట్లాడుతూ 1995లో పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో మూడు లక్షల సొంత నిధులతో బస్టాండ్ నిర్మించామని తెలిపారు. 2023లో రోడ్డు వెడల్పు పనుల నిమిత్తం బస్టాండ్‌ను తొలగించాలని అప్పటి అధికారులు, ఎమ్మెల్యే కోరారని, భవిష్యత్తులో అదే స్థలంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ప్రతిష్టిస్తామని తాము చెప్పినప్పుడు, అనుమతి ఇప్పించే బాధ్యత తమదేనని వారు హామీ ఇచ్చారని సాంబయ్య గుర్తుచేశారు. ఆ హామీ మేరకే బస్టాండ్‌ను తొలగించామని ఆయన స్పష్టం చేశారు. అందువల్ల, సదరు స్థలంలో ఇతరులకు ఎలాంటి కట్టడాలకు అనుమతులు ఇవ్వకుండా, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్టాపనకు తక్షణమే అనుమతులు ఇవ్వాలని పద్మశాలీ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం నాయకులు పత్తి శీను, బూర లక్ష్మీనారాయణ, తుమ్మ ప్రభాకర్, మామిడి మారుతి, గొట్టిముక్కుల రమేష్, బత్తుల శ్రీధర్, బాసని లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## మొహర్రం వేడుకల్లో ఎమ్మెల్యే జీఎస్సార్



**వరంగల్ వాయిస్, గణపురం:** మండలంలోని చెల్పూర్‌లో జరుగుతున్న మొహర్రం వేడుకల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెల్పూర్ ముస్లింలు మాట్లాడుతూ, అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటూ సేవలు అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

# పంటల బీమా అమలు చేసి రైతును రక్షించాలి

**◆ ఆర్డీవోకు రైతు రక్షణ సమితి వినతి**



**వరంగల్ వాయిస్, పరకాల:** రైతుల రక్షణ కోసం పంటల బీమాను అమలు చేసి వారి భద్రతకు తోడ్పడాలని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికేల కిషన్ రావు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆయన రైతులతో కలిసి పరకాల ఆర్డీవో కే. నారాయణకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ రావు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఖరీఫ్ పంటల సీజన్ ప్రారంభమైనా ఇప్పటివరకు పంటల బీమా అమలు లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతే రైతులు అప్పులు తీర్చలేక, యజమానికి కౌలు చెల్లించలేక, తదుపరి పంటలకు పెట్టుబడి లేకుండా, కుటుంబ ఖర్చులకు నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఒకసారి పంట నష్టపోయిన రైతు తిరిగి స్థిరపడటానికి మూడు నాలుగు పంటకాలాల సమయం పడుతుందని, అలాంటి పరిస్థితుల్లో పంటల బీమా రైతుకు ఒక రక్షణ కవచంగా పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పంట రుణమాఫీ, రైతు భరోసా పథకాలతో రైతులకు మంచి సంకేతాలు పంపిందని, అదే స్ఫూర్తితో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో చేరి పంటల బీమా పథకాన్ని అమలు చేసి రైతుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని కిషన్ రావు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చౌల రామారావు, రవీందర్ రఘు, కానూరు వీరస్వామితో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను అందించడమే ధ్యేయం

## ◆ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి



**వరంగల్ వాయిస్, జనగామ:** నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇవ్వడమే తమ ప్రభుత్వ ధ్యేయమని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం జనగామ జిల్లా కేంద్రంలోని సాయి రామ్ ఫంక్షన్ హాల్‌లో ఆర్డీవో ఆధ్వర్యంలో జరిగిన జనగామ నియోజకవర్గ స్థాయి సమావేశంలో అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్ (స్థానిక సంస్థలు), రోహిత్ సింగ్ (రెవెన్యూ) లతో కలిసి ఆయన ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని జనగామ మున్సిపాలిటీ, జనగామ, బచ్చన్నపేట, నర్మెట్ట, తరిగొప్పుల మండలాలలో అర్హులైన 816 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల మంజూరుతో నిరుపేదల కలలు సాకారం అవుతున్నాయన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాలలో భూ భారతి సదస్సులు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించి సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. కొత్త రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టబోతున్నామని, సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టి నిరుపేదలను ఆదుకున్నామని ఆయన అన్నారు. 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్, రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం వంటి ప్రభుత్వ పథకాలను నిరంతరంగా కొనసాగిస్తున్నామన్నారు. వ్యవసాయం పండుగలా చేపట్టేందుకు రైతన్నకు పెద్దపీట వేశామన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధర కల్పించి కొనుగోలు చేసామని వివరించారు. నిరుపేదలు ధనికుల మాదిరిగా సన్నబియ్యంతో కడుపునిండా భోజనం చేయాలని, సన్నాలు పండించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. సన్నాలు పండించే రైతులను ప్రోత్సహించేందుకు రూ.500ల బోనస్‌గా ఇచ్చామని తెలిపారు. రైతులకు రుణమాఫీతో పాటు రైతు భరోసా పథకాన్ని అమలు చేశామన్నారు. లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లు త్వరగా నిర్మించుకుంటే అధికారులు, ప్రజాప్రతినిధులతో స్వయంగా ఇంటికి వచ్చి ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్.టి.ఐ. సభ్యులు అభి గౌడ్, ఆర్డీఓ గోపిరామ్, హౌసింగ్ పీడీ మాత్రు నాయక్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, జనగామ నియోజకవర్గ స్థాయి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

# టీపీసీసీ నేతలను కలిసిన మడికొండ శ్రీను



**వరంగల్ వాయిస్, పరకాల:** వరంగల్ పార్లమెంట్ ఇంచార్జి అయిన "జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్" కార్యక్రమం బాధ్యులు, కాంగ్రెస్ పార్టీ పరకాల పట్టణ సమన్వయ కమిటీ సభ్యులు డాక్టర్ మడికొండ శ్రీను గురువారం టీపీసీసీ నేతలను మర్యాదపూర్వకంగా కలిశారు. పరకాల శాసన సభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయిత ప్రకాష్ రెడ్డిని, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మోత్కూరి ధర్మారావులను మడికొండ శ్రీనుతో పాటు ఇతర నాయకులు కలిశారు.

# లయన్స్ క్లబ్ అభయ ఆధ్వర్యంలో నోటు పుస్తకాల పంపిణీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** జులైవాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ అభయ ఉచితంగా నోటు పుస్తకాలను, పెన్నులను పంపిణీ చేసింది. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అభయ అధ్యక్షుడు ఈటూరి అజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి టి. వెంకటరమణ రావు, కోశాధికారి బి. సుధాకర్, సభ్యులు తాదూరి రేణుక, ఎం. కిరణ్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు తెలిపారు. ఈరోజు రఘునాథపల్లి మండల కమిటీ సమావేశం మంచాల మల్లేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాపర్తి రాజు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు, రైతులు, కూలీలు, గ్రామపంచాయతీ కార్మికులు, హమాలీ కార్మికులు, అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, ట్రాన్స్‌పోర్ట్ రంగంతో పాటు అన్ని రంగాల కార్మికులు సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బుక్య చందు నాయక్, మండల కార్యదర్శి గంగాపురం మహేందర్, మండల కమిటీ సభ్యులు పొదల నాగరాజు, మైలారం వెంకటేశ్వర్లు, ఇంజ వెంకట్‌స్వామి, నామాల యాదగిరి, పొదల లవ కుమార్, పొదల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవాణి కుటుంబాన్ని ఆదుకుంటాం

## ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల:** హనుమకొండ జిల్లా పరకాల మండలంలోని మల్లక్కపేట గ్రామం శివారులో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహాన్ని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి గురువారం సందర్శించారు. గత మూడు రోజుల క్రితం వసతి గృహంలో ఉరివేసుకొని బలవన్మరణం చెందిన ఏకు శ్రీవాణి మృతికి గల కారణాలను పాఠశాల ఉపాధ్యాయుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనుకోని సంఘటన జరగడం బాధాకరమని, దీనిపై పూర్తిస్థాయిలో ఎంక్వైరీ చేసి లోపాలను గుర్తించి, ఇందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తరపున చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం శ్రీవాణి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, ఆమె కుటుంబసభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, పట్టణ నాయకులు ఉన్నారు.

# 'మన బడి.. మన బాధ్యత'



**వరంగల్ వాయిస్, నడికూడ:** "మన ఊరు మన బడి మన బాధ్యత" అనే నినాదంతో నడికూడ మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామానికి చెందిన ఆదర్శ యువత తమ గ్రామంలోని పాఠశాలకు 15 కుర్చీలను విరాళంగా ఇచ్చి ఆదర్శంగా నిలిచింది. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సౌకర్యార్థం ఈ కుర్చీలను అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు మెరుగుపరిస్తే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని, కాబట్టి దాతలు ముందుకు రావాలని ఈ యువత కోరింది. సేవా దృక్పథం కలిగిన ఇలాంటి యువత వల్ల ప్రభుత్వ బడులు మరింత బలోపేతం అయ్యే అవకాశం ఉంటుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కందుకూరి శ్రీనివాస్ వారిని ప్రత్యేకంగా అభినందించారు.

# విద్యార్థిని మృతితో విద్యార్థుల ఇంటి బాట

## బోసిపోయిన మల్లక్కపేట గురుకుల పాఠశాల



**వరంగల్ వాయిస్, పరకాల:** మల్లక్కపేట బాలికల గురుకుల పాఠశాలలో ఇటీవల 10వ తరగతి విద్యార్థిని శ్రీవాణి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటనతో విద్యార్థులలో భయాందోళన నెలకొంది. దీంతో విద్యార్థులు ఇంటిదారి పట్టగా, సాంఘిక సంక్షేమ గురుకుల శాఖ అధికారులు తాత్కాలిక సెలవులను ప్రకటించారు. గురువారం విలేకరులు గురుకుల పాఠశాలను సందర్శించగా, విద్యార్థులతో సందడిగా ఉండాల్సిన పాఠశాల ఆవరణ బోసిపోయి, కళావిహీనంగా కనిపించింది. ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ, అందరి ముఖాల్లో విచారం స్పష్టంగా కనిపించింది. తమ మధ్య ఎంతో అన్యోన్యంగా, ఆప్యాయంగా తిరిగే విద్యార్థిని ప్రస్తుతం లేదనే విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని పేరు చెప్పడానికి ఇష్టపడని ఒక ఉపాధ్యాయురాలు ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం. ఈ సోమవారం నుంచి తిరిగి పాఠశాల ప్రారంభమవుతుందని ప్రిన్సిపల్ తెలిపారు. ఏది ఏమైనప్పటికీ, శ్రీవాణి జ్ఞాపకాల నుంచి తేరుకొని విద్యార్థులంతా ఆత్మస్థైర్యంతో విద్యాభ్యాసం చేస్తూ ముందుకు సాగాల్సి ఉంది.

# విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి నూతనంగా ప్రవేశాలు పొందిన విద్యార్థులకు గురువారం పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి మాట్లాడుతూ, కళాశాలలో ఉన్న సదుపాయాలను విద్యార్థులు సంపూర్ణంగా ఉపయోగించుకొని తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు. గత సంవత్సరం కళాశాలలో కేవలం ఆర్ట్స్ గ్రూపులు మాత్రమే ఉండేవని, అయితే ఈ విద్యా సంవత్సరం నుంచి ఎంపీసీ, బైపీసీ గ్రూపులు కూడా అందుబాటులోకి వచ్చాయని ఆమె తెలిపారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో ప్రవేశాలు తీసుకునేలా తమ తోటి విద్యార్థులకు తెలియజేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామీణ, పేద విద్యార్థులను కళాశాలలో చేర్పించాలని కూడా ఆమె విజ్ఞప్తి చేశారు.

# ఉచిత కంటి వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** కెనరా బ్యాంక్ ఆత్మకూరు శాఖ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు బ్రాంచ్ మేనేజర్ నవీన్ తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ, కెనరా బ్యాంక్ ఆవరణలో శరత్ కంటి ఆసుపత్రి వైద్య బృందంతో కలిసి ఖాతాదారులకు, గ్రామస్తులకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కంటి జబ్బులు ఉన్నవారిని గుర్తించి, వారికి అద్దాలు, మందులు అందజేస్తామని చెప్పారు. కంటి ఆపరేషన్లు, ఇతర చికిత్సలు అవసరమైన వారికి శరత్ కంటి ఆసుపత్రిలో వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



**వరంగల్ వాయిస్, శాయంపేట:** రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల కోసం రూ. 33 కోట్ల రుణమాఫీ పథకాన్ని ప్రకటించిన నేపథ్యంలో, శాయంపేట మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘం సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం చైర్మన్, సభ్యులు, నాయకులు మార్కండేయతో పాటు సంఘ కార్మికులు పాల్గొన్నారు.

# ఖర్గే సభకు భారీగా తరలిరావాలి

## కాంగ్రెస్ సీనియర్ నేత అంబాల రాజు



**వరంగల్ వాయిస్, జమ్మికుంట:** హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జులై 4న జరగనున్న సభను విజయవంతం చేయాలని జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అంబాల రాజు మాట్లాడుతూ, ఈ కార్యక్రమానికి ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నాయకులు మల్లికార్జున ఖర్గే ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. ఈ సభకు జమ్మికుంట మండలం నుండి మేధావులు, కార్మికులు, కర్షకులు, దళితులు, బీసీలు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. "జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్.." అనే నినాదంతో, భావి ప్రధాని రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ముందుకు వెళ్తున్న తరుణంలో, రేపు జరిగే ఈ సభను విజయవంతం చేయాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని ఆయన ఆకాంక్షించారు.

# మర్కజీ పాఠశాలలో ఎన్ సీసీ క్యాడెట్లకు సర్టిఫికెట్ల ప్రదానం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రభుత్వ మర్కజీ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ కోర్సు పూర్తి చేసిన క్యాడెట్లకు 'ఏ' సర్టిఫికెట్ల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వి. రామారావు మాట్లాడుతూ, క్రమశిక్షణతో పాటు దేశభక్తిని పెంపొందించడంలో ఎన్‌సీసీ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. సర్టిఫికెట్లు పొందిన పలువురు క్యాడెట్లకు పాలిటెక్నిక్‌తో పాటు ఇతర కోర్సుల్లో సీట్లు లభించాయని ఎన్‌సీసీ అధికారి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ కె. వాసు, ఎన్‌సీసీ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు శిక్షణ పూర్తి చేసుకున్న క్యాడెట్లను అభినందించారు.

# డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 20 మందికి శిక్షలు పడ్డాయి. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, ఏసీపీ టి.సత్యనారాయణ పర్యవేక్షణలో జరిగిన ఈ తనిఖీల్లో పట్టుబడిన వారిని మేజిస్ట్రేట్ అబ్బోజు వేంకటేశం ఎదుట హాజరుపరిచారు. విచారణ అనంతరం, డ్రైవర్‌గా పనిచేస్తున్నలోకబోయిన నాగరాజు, కూలీ మ్యాదం బాలకృష్ణ , ఆటోడ్రైవర్ బొట్ల రాజేష్ లకు మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ హుజురాబాద్ సబ్ జైలుకు తరలించారు. మిగిలిన 17 మందికి రూ.22,700 జరిమానా విధించారు. అలాగే, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడిపిన ముగ్గురు వ్యక్తులను కోర్టులో హాజరుపరచగా, వారికి రూ.1,500 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె. రామకృష్ణ తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

## ◆ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, దామెర:** పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలను నాటాలని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం దామెర మండలంలోని ఒగ్లాపూర్ సైలానీ బాబా దర్గాలో, దర్గా పీఠాధిపతి మహమ్మద్ అబ్దుల్ హమీద్ షామియాతో కలిసి కాంగ్రెస్ నాయకులతో కలిసి మొక్కలను నాటి వన మహోత్సవాన్ని మండలంలో ప్రారంభించారు. ముందుగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక కార్యక్రమంగా చేపట్టిన వన మహోత్సవంలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని అన్నారు. మొక్కలు నాటడమే కాకుండా, వాటిని బాధ్యతగా సంరక్షించాలని తెలిపారు. భవిష్యత్తు తరాలకు మంచి వాతావరణాన్ని అందించాలని, మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని, వాతావరణ సమతుల్యాన్ని కాపాడటానికి, వాతావరణం ఆహ్లాదకరంగా ఉండటానికి పచ్చదనం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలోని సభ్యుల సంఖ్యను బట్టి ఒక్కొక్క మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. ఈ విధంగా నాటినట్లయితే రాష్ట్రంలో నాలుగు కోట్ల పైచిలుకు మొక్కలు నాటవచ్చని అన్నారు. అందరం కలిసి వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి బాలరాజు, ఎంపీడీవో గుమ్మడి కల్పన, ఎమ్మార్వో జ్యోతి వరలక్ష్మి దేవి, ఆర్ఐ సంపత్, ఎస్సై కొంక అశోక్, పంచాయతీ కార్యదర్శి ఇంజపెల్లి నరేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రకాశ్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుడిపాటి శ్రీధర్ రెడ్డి, సదిరం పోశయ్య, పోలేపాక శ్రీనివాస్, దామెర శంకర్, ప్రధాన కార్యదర్శి దురిశెట్టి భిక్షపతి, రాజేష్, కిరణ్ పాల్గొన్నారు.

# నూతన ఎంఈఓ మురళికి వడుప్సా నేతల శుభాకాంక్షలు



**వరంగల్ వాయిస్, వరంగల్:** వడుప్సా వరంగల్ జోన్ అధ్యక్షుడు కూచన క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో వరంగల్ మండల ఎంఈఓగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎం.మురళిని వారి కార్యాలయంలో వడుప్సా (ట్రస్మా) కమిటీ సభ్యులంతా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మురళికి బొకే ఇచ్చి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వడుప్సా (ట్రస్మా) జిల్లా గౌరవ అధ్యక్షులు ఆడెపు శ్యామ్, జిల్లా కోశాధికారి ఠాగూర్ జ్ఞానేశ్వర్ సింగ్, ట్రస్మా జిల్లా సలహాదారులు కొడెం శ్రీధర్, పొన్నోజు చక్రపాణి, జిల్లా ప్రతినిధులు ఆడెపు వెంకటేశ్వరులు, మడిపెల్లి రాజు, ఖిలా వరంగల్ జోన్ అధ్యక్షుడు ముక్కెర రవీందర్, వడుప్సా వరంగల్ జోన్ కోశాధికారి కూరపాటి మోహన్, జోన్ సలహాదారులు కొడిమెల రవి, వడుప్సా జోన్ ప్రతినిధులు నందాల చందర్ బాబు, వి.విశ్వనాథ్, జి.ప్రవీణ్ కుమార్, డి.నర్సింహా స్వామి, కూచన విశ్వేశ్వర్, కూచన శ్రీనివాస్ తదితర కరస్పాండెంట్‌లు పాల్గొన్నారు.

# యజమానులకు ద్విచక్ర వాహనాల అందజేత

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో దొంగిలించబడిన 10 ద్విచక్ర వాహనాలను హనుమకొండ ట్రాఫిక్ పోలీసులు స్వాధీనం చేసుకుని, వాటి అసలు యజమానులకు (బాధితులకు) అప్పగించారు. హనుమకొండ ట్రాఫిక్ పోలీసులు రోజువారీ నిర్వహించే క్షుణ్ణమైన వాహన తనిఖీలలో భాగంగా 2024 డిసెంబర్ నెల నుంచి ఇప్పటివరకు దొంగిలించి నడుపుతున్న ఈ 10 మోటార్ సైకిళ్లను రికవరీ చేశారు. గురువారం అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర్ రావు మహబూబాబాద్‌కు చెందిన ఒక ద్విచక్ర వాహనాన్ని దాని యజమానికి అందించారు. TS26F2961 నంబర్ గల ఈ వాహనం 2022 మే నెలలో దొంగిలించబడిందని మహబూబాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇప్పటివరకు అప్పగించిన 10 ద్విచక్ర వాహనాలలో, 9 వాహనాలపై కరీంనగర్ 1 టౌన్, కొండాపూర్, సదాశివపేట, రాజన్న సిరిసిల్ల, ఆకివీడు (ఆంధ్రప్రదేశ్), ధర్మసాగర్, సుబేదారి, గోదావరిఖని, మహబూబాబాద్ పోలీస్ స్టేషన్లలో ఎఫ్ఐఆర్ లు నమోదయ్యాయి. మరో వాహనం కాటారం (భూపాలపల్లి జిల్లా)కు సంబంధించినది. వాహనాలతో పట్టుబడిన నిందితులను సంబంధిత పోలీసులకు అప్పగించారు. హనుమకొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ టి.సత్యనారాయణ, హనుమకొండ ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది హాజరయ్యారు.



# వర్ష విపత్తును ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగం సిద్ధం

## జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**వరంగల్ వాయిస్, ములుగు:** జూలై, ఆగస్టు మాసాలలో జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అధికారులు సూచనలు, సలహాలను పాటించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు మహేందర్ జి.సంపత్ రావులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడారు. జిల్లాలో 61 గ్రామాలు వర్ష విపత్తుకు గురయ్యే అవకాశం ఉందని, 970 శిథిలావస్థలో ఉన్న ఇళ్ల కుటుంబాల యజమానులను అప్రమత్తంగా ఉండాలని సూచించడం జరిగిందని ఆయన తెలిపారు. జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు భారీ వర్షాల సందర్భంగా వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని, ప్రమాద స్థలాలలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. జిల్లాలో 800 చెరువులు ఉండగా 13 చెరువులు పెద్దవి ఉన్నాయని, నీటి ప్రవాహంతో నిండుగా ఉన్న చెరువులను ముందస్తుగా గమనించడం జరుగుతుందని వివరించారు. జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాలలో ఫ్లడ్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి 24 గంటల పాటు అధికారులు విధులు నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేశామని, ప్రమాద పరిస్థితిలో ఉన్న 30 గ్రామాల ప్రజలకు రిస్క్ జాకెట్లను పంపిణీ చేయడంతో పాటు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచి నాలుగు బోట్లను సిద్ధం చేసినట్లు తెలిపారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను పర్యటించే పర్యాటకులు నీటి ప్రవాహాలలో దిగవద్దని, దట్టమైన అటవీ ప్రాంతాలకు వెళ్లవద్దని అన్నారు.వర్షపు విపత్తును ఎదుర్కోవడానికి పోలీస్, అగ్నిమాపక సిబ్బంది, వైద్యశాఖ, విద్యుత్ శాఖ అధికారులను అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశామని, లోతట్టు ప్రాంతాలలోని గర్భిణీ స్త్రీలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని వైద్య అధికారులకు తెలిపారు. 58 పునరావాస కేంద్రాలలో 15 వేల మంది ఉండే విధంగా ఏర్పాటు చేశామని, ప్రస్తుత వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సంబంధాల అధికారి ఎండీ రఫిక్, సిబ్బంది పాల్గొన్నారు.

# పకడ్బందీగా రేషన్ కార్డుల వెరిఫికేషన్ ప్రక్రియను నిర్వహించండి

**వరంగల్ వాయిస్, బల్దియా :** రేషన్ కార్డుల వెరిఫికేషన్ ప్రక్రియ ను పకడ్బందీగా నిర్వహించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్లో రేషన్ కార్డ్ వెరిఫికేషన్ అధికారులు, ఆర్ఐలు, ఆర్ఓలతో రేషన్ కార్డు వెరిఫికేషన్ ప్రక్రియ పురోగతిని కమిషనర్ సమీక్షించారు. డిప్యూటీ కమిషనర్లు రవీందర్ ప్రసన్న రాణి, ఆర్ఓలు యూసుఫొద్దీన్, షహజాది బేగం, టీఎంసీ రమేష్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ సినిమా
గురువారం 03 జూలై 2025
7

# పులిని వేటాడే బెబ్బులి

## అదిరిపోయేలా హరిహరవీరమల్లు ట్రైలర్

పవన్ ఫాన్స్‌కు పండగే పండగ. హరిహర వీరమల్లు థియేట్రికల్ ట్రైలర్ రిలీజ్ చేశారు. దాదాపు మూడు నిమిషాల నిడివితో వచ్చిన ఈ ట్రైలర్ పవన్ ఫ్యాన్స్‌కు ఫుల్ మీల్స్ పట్టేలా.. విజువల్ ట్రీట్ ఇచ్చేలా ఉంది. మేకర్స్ ముందు నుంచి చెబుతున్నట్టుగా.. అద్భుతమైన విజువల్స్‌తో హరిహర వీరమల్లు ట్రైలర్ అదిరి పోయింది. మూడే మూడు డైలాగ్స్‌తో సినిమా కథను చెప్పేశారు. హిందువుగా జీవించాలంటే పన్ను కట్టాల్సిన సమయం, ఈ దేశ శ్రమ బాద్‌షా పాదాల కింద నలిగిపోతున్న సమయం, ఒక వీరుడు కోసం ప్రకృతి పురుడు పోసుకుంటున్న సమయం.. అంటూ మొఘలులను ఎదురించిన వీరుని కథే హరిహర వీరమల్లు కథ అని చెప్పేశారు. కోహినూర్ డైమండ్ అంటూ పవన్‌కి ఇచ్చిన ఎలివేషన్ పీక్స్ అనే చెప్పాలి. పవర్ స్టార్ చెప్పిన డైలాగ్స్ బాగున్నాయి. పులిని వేటాడే బెబ్బులిని చూస్తారు అంటూ.. పవన్ చెప్పిన డైలాగ్ విజిల్స్ వేసేలా ఉంది. అలాగే.. మన దేశ ప్రధాని మోదీ పవన్ గురించి చెప్పిన 'యే పవన్ నహీ ఆంధీ హై' డైలాగ్‌ను ట్రైలర్‌లో హైలెట్ చేశారు. విలన్ బాబీ డియోల్ చేత.. ఆంధీ వచ్చేసింది అంటూ ఎలివేషన్ ఇచ్చారు. ఔరంగజేబు పాత్రలో బాబీ డియోల్‌ను పవర్ ఫుల్‌గా చూపించారు. ఇక పవన్ లుక్, యాక్షన్, విజువల్ పరంగా ట్రైలర్ అదరహో అనేలా ఉంది. కాకపోతే.. కొన్ని ఫ్రేమ్స్‌లో సీజీ వర్క్ పై ఇంకాస్త దృష్టి పెట్టాల్సింది. కానీ పీరియాడికల్ సెటప్ మాత్రం అదిరిపోయింది. నిర్మాత ఏఎం.రత్నం పెట్టిన బడ్జెట్ ప్రతి ఫ్రేమ్‌లో కనిపిస్తోంది. హీరోయిన్ నిధి అగర్వాల్‌కు మంచి పాత్ర పడినట్టుగా ఉంది. ఆస్కార్ విన్నర్ ఎంఎం. కీరవాణి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ బాగుంది. మొత్తంగా.. పవన్ ఫ్యాన్స్‌ను మెప్పించేలా ఉంది ఈ ట్రైలర్. ఇక్కడితో సినిమా పై అంచనాలు మరింతగా పెరిగిపోయాయి. వీరమల్లు విధ్వంసం ఎలా ఉంటుందో చూడానికి ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు అభిమానులు. మరి హరిహర వీరమల్లు ఎలా ఉంటుందో తెలియాలంటే.. జులై 24 వరకు వెయిట్ చేయాల్సిందే.




# ధనుష్ అత్యుత్తమ నటుల్లో ఒకరు



## 'తేరే ఇష్క్ మే గురించి కృతి సనన్

కోలీవుడ్ హీరో ధనుష్ తన నటనతో ఇప్పటికే తమిళ ప్రేక్షకుల మనసులు గెలుచుకోగా.. అతని టాలెంట్ అక్కడే ఆగలేదు.. బాలీవుడ్, హాలీవుడ్ సినిమాల్లోనూ చక్కటి నటనతో తిరుగులేని మార్కెట్ సంపాదించు కున్నారు. ఇప్పుడు ఆయన నటిస్తున్న తాజా హిందీ చిత్రం 'తేరే ఇష్క్ మే'. ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వం వహించగా, 'రాంజనా', 'అత్రంగి రే' తర్వాత ధనుష్ ఆనంద్ కలయికలో వచ్చిన మూడో సినిమా ఇది. తాజా అప్డేట్ ప్రకారం ఈ సినిమా షూటింగ్ పూర్తి అయిందని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది.

ఈ సందర్భంగా కృతి సనన్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో భావోద్వేగ పోస్ట్ షేర్ చేస్తూ ధనుష్‌పై ప్రశంసల జల్లు కురిపించింది. నేను ఇప్పటి వరకు కలిసి పనిచేసిన అత్యుత్తమ నటుల్లో ధనుష్ ఒకరు. అతనితో పని చేయడం సంతోషంగా ఉంది. ఈ జర్నీ ఎంతో స్పెషల్‌గా మిగిలిపోతుంది' అని పేర్కొంది. అలాగే, దర్శకుడు ఆనంద్ ఎల్ రాయ్ గురించి కూడా ఆమె ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపింది.. 'ఈ సినిమాకు నన్ను ఎంపిక చేసినందుకు ధన్యవాదాలు సర్. ఇది ఓ రోలర్ కోస్టర్ రైడ్‌లా వేగంగా పూర్తయిపోయింది' అని తెలిపింది. ఇది ధనుష్, కృతి సనన్ జంటగా నటిస్తున్న మొదటి సినిమా, అందుకే ఈ కాంబినేషన్‌పై అభిమానుల్లో మంచి క్యూరియాసిటీ నెలకొంది.






# విడుదలవుతున్న తమ్ముడు

## తమ్ముడు ప్రమోషన్లకు దూరంగా నితిన్

రాబిన్‌హుడ్ తర్వాత నితిన్ నుండి వస్తోన్న మూవీ తమ్ముడు. వేణు శ్రీరామ్ దర్శకుడు. ఈ శుక్రవారం థియేటర్లలోకి రాబోతుంది. ఈ సినిమాతో నితిన్ బౌన్స్ బ్యాక్ అవుతాడని మేకర్స్ గట్టిగానే చెబుతున్నారు. కానీ నితిన్ మాత్రం సైలెంట్‌గా స్మైల్ ఇస్తున్నాడు. చెప్పాలంటే పెద్దగా ప్రమోషన్లలో పార్టిసిపేట్ చేయడం లేదు. మరి ప్రమోషన్ల సంగతేంటీ అంటే వాటిని మేకర్స్‌తో పాటు హీరోయిన్స్ భుజానకెత్తుకున్నారు . సినిమా ఎనౌన్స్ మెంట్ నుండి రిలీజ్ వరకు మేకర్లతో పాటు భుజాన వేసుకుని చేస్తున్నారు హీరోయిన్స్. హాయ్, బై చెప్పామా అని కాకుండా అవసరమైనప్పుడల్లా లయ, వర్ష బొల్లమ్మ, స్వసిక, సప్తమి గౌడలు తమ్ముడు టీమ్‌కి అండగా నిలుస్తున్నారు. దర్శకుడు వేణు శ్రీరామ్‌తో కలిసి ప్రమోషన్లను చేస్తున్నారు. తమ్ముడు ఎనౌన్స్ మెంట్ నుండి ప్రీ రిలీజ్ ఈవెంట్స్ వరకు వరుస ఇంటర్వ్యూలు, ప్రచారాల్లో పాల్గొంటున్నారు. మరి ఈ ప్రమోషన్లు ఎంత వరకు వర్కౌట్ అయ్యాయి అంటే సినిమాపై గట్టి బజ్ నడిచేలా ఇంపాక్ట్ క్రియేట్ చేయగలిగాయి. తమ్ముడు అటు దర్శకుడికి, ఇటు హీరోకి చాలా కీలకం. అలాంటిది నితిన్ ప్రమోషన్స్ ఏ లెవల్లో చేయాలి.. కానీ కామ్‌గా ఉంటున్నాడు. దీనికి కారణం రాబిన్ హుడ్ డిజాస్టర్. హిట్ కాంబోలో తెరకెక్కిన రాబిన్ హుడ్‌పై ఎన్నో హోప్స్ పెట్టుకున్నాడు నితిన్. ఆ సినిమా ప్రమోషన్స్ లో ఎక్కడ చూసినా నితినే కనిపించాడు. కానీ ఆ సినిమా డిజిస్టార్ తో ఒక్కసారిగా డీలా పడిపోయాడు. ఇప్పుడు ప్రమోషన్లకు దూరంగా ఉండటానికి ఇదే కారణమంటున్నారు.

# జర్నలిస్ట్ జ్ఞాపకార్థం కమ్యూనిటీ హాల్

- రూ.20 లక్షల ఎంపీ నిధులతో ఏర్పాటు
- శంకుస్థాపన చేసిన డాక్టర్ కడియం కావ్య



**వరంగల్ వాయిస్, బీమారం :** సంకల్పం గట్టిగా ఉంటే ఎంతటి పని అయినా సాధించవచ్చని.. అందుకు ఈ కమ్యూనిటీ హాల్ ఒక నిదర్శనమని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. బీమారం 55వ డివిజన్ లో రూ.20 లక్షల ఎంపీ నిధులతో నిర్మించనున్న బీసీ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులకు గురువారం కడియం కావ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జర్నలిస్ట్ నాయకపు సుభాష్ జ్ఞాపకార్థంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసుకుని త్వరలో ప్రారంభించుకోబోతున్నామని తెలిపారు. ఈ కమ్యూనిటీ హాల్ కోసం సుభాష్ ఎంతగానో కృషి చేశాడని, వారి సంకల్పంతోనే ఈ రోజు సాధ్యం అయిందన్నారు. సుభాష్ ఇప్పుడు మన మధ్యలో లేక పోవడం బాధాకరమన్నారు. మరో రెండు నెలల్లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. సుభాష్ కుటుంబ సభ్యులు వారి వ్యక్తిగతంగా సహాయం కోరకుండా అందరికీ ఉపయోగపడేలాగా వారి జ్ఞాపకార్థంగా కమ్యూనిటీ హాల్ ఉండాలని కోరుకోవడం గొప్ప విషయం అన్నారు. ఈ సందర్భంగా సుభాష్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఆత్మస్థైర్యాన్ని కల్పించాలని భగవంతున్ని ప్రార్థించారు. ఇటీవల పలువురు జర్నలిస్ట్ లు ఆకాల మరణాలు తనను ఎంతో బాధించాయని ఎంపీ అన్నారు. రాత్రి, పగలు అని తేడా లేకుండా పని చేస్తున్న జర్నలిస్టు సోదరులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జక్కుల రజిత–వెంకటేశ్వర్లు ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# నాణ్యతతో నిర్మించాలి

- కార్పొరేటర్ ముష్కమల్ల అరుణ
- రూ.27 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** నగరంలోని 33 వ డివిజన్ ఎస్ఆర్ఆర్ తోట లక్ష్మీ నగర్, శివ నాగేంద్ర నగర్ లో రూ.27 లక్షలతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ ముష్కమల్ల అరుణ–సుధాకర్ గురువారం శంకుస్థాపన చేశారు. పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ముఖ్య నాయకులు కత్తెరసాల శ్రీధర్, కోడం శివ, టింగిల్ కార్ హుస్సేన్, జీవన్, శ్యామ్, రాముల భిక్షపతి, శివ నాగేంద్ర నగర్ అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు గడ్డం కేశవ మూర్తి, నాగేశ్వరరావు, టింగలికార్ శీను, కొమ్మరాజుల సందీప్, బొమ్మగాని శ్రీనివాస్, చందు తదితరులు పాల్గొన్నారు.

# పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలి

- మేడారం జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి
- వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలి
- దేవాదాయ శాఖ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్

**వరంగల్ వాయిస్, ములుగు :** రెండేళ్లకోసారి జరిగే మేడారం మహా జాతరను సమర్థవంతంగా నిర్వహించేందుకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని దేవాదాయ శాఖ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్ ఆదేశించారు. జాతర సందర్భంగా చేపడుతున్న పనులు శ్వాశతంగా నిలిచేలా ఉండాలని సూచించారు. ప్రతి జాతరకు వందల కోట్ల రూపాయలు కేటాయిస్తున్న విషయాన్ని మరువరాదన్నారు. గురువారం ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని మేడారం ఐటీడీఏ గెస్ట్ హౌస్ సమావేశ మందిరంలో రాష్ట్ర ఎండోమెంట్స్ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అడ్వైజర్ గోవిందహరిలతో కలిసి శ్రీ సమ్మక్క సారలమ్మ మహా జాతర–2026 పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజా రామయ్యర్ మాట్లాడుతూ మేడారం వచ్చే భక్తుల సౌకర్యార్థం చేపట్టే పనుల మాస్టర్ ప్లాన్ నివేదికను కమిటీ క్షేత్ర స్థాయిలో పరిశీలించి, పక్క ప్రణాళిక రూపొందించాలని సూచించారు. కోటిన్నర భక్తులు హాజరయ్యే ఈ నాలుగు రోజుల జాతరకు జిల్లా యంత్రాంగం తగిన ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలన్నారు. గత జాతర అనుభవాలను దృష్టిలో ఉంచుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు ఉండాలన్నారు. ప్రతి జాతరకు కోట్ల రూపాయలతో పనులు చేపడుతున్నామని, ప్రతి పనిని నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. అంతుముందు జంపన్న వాగు, చిలుకలగుట్ట, కన్నెపల్లిలోని సారలమ్మ దేవాలయాన్ని వారు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్, ఎండోమెంట్ అడ్వైజర్ గోవిందా హరితో కలిసి మేడారంలోని శ్రీ సమ్మక్క సారలమ్మ వనదేవతలను దర్శించుకోగా సమ్మక్క సారలమ్మ పూజారులు డోలు వాయిద్యాలతో వారికి స్వాగతం పలికి గద్దెలపైకి తోడుకొని వెళ్లారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేష్, ఏపీఓ వసంత రావు, ఈఓ వీరస్వామి, పూజారుల సంఘం అధ్యక్షులు జగ్గారావు, పూజారులు, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్ర ప్రభాగ భద్రకాళి

- ఎనిమిదో రోజుకు చేరిన శాకంబరి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** శ్రీ భద్రకాళి దేవస్థానంలో శాకంబరీ నవరాత్ర మహోత్సవాలు గురువారం ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ మూర్తులలో ఇచ్చాశక్తిని కాళీ క్రమాన్ని అనుసరించి 'ఉగ్రప్రభా' గాను షోడశీ క్రమాన్ని అనుసరించి జ్ఞానశక్తిని 'త్వరితామాత' గాను అంకరించి పూజారాధనలు నిర్వహించారు. అమ్మవారి విభూతియైన ఉగ్రప్రభా మాతకే ప్రత్యంగిరా అను నామాంతరం కూడా ఉంది. ప్రళయకాలమునందలి అగ్నితో సమములగు శరీరకాంతులతో ప్రకృతిని, ప్రాణికోటిని బాధించే శక్తులను ఈ మాత నుంచి ప్రజ్వల్లిల్లే ప్రళయకాలాగ్ని వంటి బ్వాలలు సంహరిస్తాయి. పాడిపంటలకు కీడు తలపెట్టు అసురీశక్తులను నశింపజేస్తుంది. జన్మజన్మాంతరములనుంచి సంక్రమించిన పాపం వల్ల భూతగణముచే పీడింపబడుచున్న జీవుల పాపమును నశింపజేసి మనుష్యులను పీడిస్తున్న అసురీ శక్తులను దూరం చేసి కాళికా భక్తులకు వరాలిస్తుందని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు.



## అత్యవసర సమావేశం..

ఈ నెల 10న నిర్వహించనున్న శాకంబరీ అలంకరణ సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్ల నిమిత్తం భద్రాకళి ఆలయంలోని ఈఓ కార్యాలయంలో గురువారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, ఓరుగంటి పూర్ణచందర్, తొగరు క్రాంతి, బింగ్ సతీష్, మోతుకూరి మయూరిరామేశ్వరావు, గాండ్ల స్రవంతి, పాలడుగు అంజనేయులు, కారతి వెంకటేశ్వర్లు, అనంతుల శ్రీనివాస్ రావు, ఈఓ శేషుభారతి, మట్వాడ ఇన్ స్పెక్టర్ గోపి, ట్రాఫిక్ ఎస్సై సాయికిరణ్ పాల్గొని వివిధ అంశములపై చర్చించారు. ఆలయానికి విచ్చేయు భక్తులకు క్యూలైన్లు, మంచినీటి వసతి, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. గత సంవత్సరం జరిగిన లోటుపాట్లను సరిదిద్దుకొని ఈ ఏడు మరింత సమర్దవంతంగా నిర్వహించేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేసేలా నిర్ణయించారు. క్యూ లైన్లలో భక్తులకు ఉచితంగా ప్రసాదములు, వాటర్ బాటిల్స్, బాదంమిల్క్, మజ్జిగ పంపిణీ చేయాలని నిర్ణయించారు. ప్రసాద విక్రయ కౌంటర్లు కూడా అదనంగా ఏర్పాటు చేయుటకు నిర్ణయించారు. ఈ నెల 10వ తారీకు శాకంబరీ రోజున అమ్మవారి దర్శనమునకు విచ్చేయు భక్తులు పాలిటెక్నిక్ ప్రక్కన ఉన్న రహదారి గుండా ప్రవేశించి దర్శనం అనంతరం కాపువాడ మీదుగా వెళ్లేలా ఏర్పాటు చేయుటకు నిర్ణయించారు. అనంతరం దేవాలయములో కమీషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ వారి ఆదేశాల మేరకు వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా దేవాలయ ఈఓ, ధర్మకర్తలు ఉసిరి, మందారతోపాటు వివిధ పూల మొక్కలు నాటారు.

# ఘనంగా జ్ఞాన సప్తాహం ప్రారంభం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** చిన్మయ మిషన్ వరంగల్ వారి ఆధ్వర్యంలో హనుమకొండ సాయిబాబా మందిరంలో శ్రీ యజ్ఞనంద స్వామి వారిచే నిర్వహించనున్న జ్ఞాన సప్తాహం కార్యక్రమం గురువారం సాయంత్రం మందిరంలో ఘనంగా ప్రారంభమైంది. మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్, ధర్మకర్తలు వెయ్య గండ్ల రమేష్, పూస సురేష్ కుమార్, నిమ్మల శ్రీనివాస్ స్వామి వారితో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏడు రోజులపాటు ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు 'కైవల్యోపనిషత్'లపై ఈ ప్రవచన కార్యక్రమం సాగుతుందని నిర్వాహకులు ఆచార్య బ్రహ్మచారిణ లతికా చైతన్య వెల్లడించారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com